క్లుప్తంగా

ప్రగతి యువజన సంఘం కమిటీ ఎన్నిక

కందుకూరు: మండల పరిధిలోని కొత్తూర్ ప్రగతి యువజన సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దయ్యాల హరీశ్, ఉపాధ్యక్షుడిగా మీగడి హరిప్రసాద్, జనరల్ సెక్రటరీగా కర్నాటి ఆకాశ్‌గౌడ్, కోశాధికారిగా ఆయిల్ల మల్లేశ్, కార్యవర్గ సభ్యులుగా దయ్యాల శివకుమార్, కాటం విష్ణుగౌడ్, జి.హరీశ్, డి.అఖిల్, సలహాదారులుగా దయ్యాల శ్రీకాంత్, మీగడి శ్రీకాంత్, కర్నాటి శ్రావణ్‌కుమార్, కర్నాటి సాయి, కర్నాటి రాజేశ్, దయ్యాల రాజు, పగిడిపాల గణేశ్, బొక్క శేఖర్‌రెడ్డిని నియమించినట్లు సంఘం నాయకులు తెలిపారు.

శ్మశానవాటికను కుల సంఘాలకు కేటాయించొద్దు

తహసీల్దార్‌కు గ్రామ పెద్దల వినతి



బాలాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామ పెద్దలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లోని శ్మశానవాటిక స్థలాన్ని కుల సంఘాలకు కేటాయించొద్దని కోరుతూ గురువారం బాలాపూర్ తహసీల్దార్‌కు గ్రామస్తులు, పెద్దలు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 110లోని 6 ఎకరాల 23 గుంటల భూమిని గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు కేటాయించినట్లు గుర్తుచేశారు. 1953–54 నాటి నుంచే ఆర్‌ఓఆర్ కాస్ర పహాణీ రికార్డుల్లో ఉందని తెలిపారు. ప్రస్తుతం ఈ శ్మశానవాటికలో గ్రామం, పరిధి 90కిపైగా కాలనీలలో ఎవరూ చనిపోయినా.. దహన సంస్కారాలు ఇక్కడే జరుగుతాయని పేర్కొన్నారు. ఇలాంటి వైకుంఠ ధామాన్ని కుల సంఘాలకు ఇతర ఏ అవసరాలకు కేటాయించకుండా చూడాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సూర్గంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, పెద్దబావి దర్శన్‌రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, బంగారు ప్రభు, గౌర శ్రీనివాస్, గట్టు కొండల్, గౌర సాయి తదితరులు ఉన్నారు.

ఓటరు ముసాయిదాపై అభ్యంతరాల స్వీకరణ



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి

మహేశ్వరం: ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు సంబంధించిన ముసాయిదా, పోలింగ్ కేంద్రాల ప్రచురణల్లో అభ్యంతరాలపై గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఇటీవల ప్రచురించిన ముసాయిదాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పార్టీల నాయకులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అశోక్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ వాంబే కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ కొత్తపేట ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ హనుమాన్‌నగర్, రాక్‌టౌన్, వాంబేకాలనీ, వీ–గార్డ్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి వారికి పాఠాలు బోధించారు. అధికారులుగా వ్యవహరించారు. ఆర్‌జేడీగా చిన్ని, డీఈఓగా ప్రవీణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడిగా గణేశ్, 25 మంది టీచర్లుగా వ్యవహరించారు. అనంతరం చిన్నారులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

టార్గెట్ రూ.24.54 కోట్లు

- పన్నుల వసూలుపై ప్రత్యేక నజర్
- ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది
- జల్‌పల్లి కార్యాలయంలో కౌంటర్ల ఏర్పాటు



జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం

పహాడీషరీఫ్: వందశాతం పన్నుల వసూలే లక్ష్యంగా జల్‌పల్లి మున్సిపల్ అధికారులు ముందుకు సాగుతున్నారు. ఆర్థిక సంవత్సరం (2024– 25) గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులు, లాక్‌డౌన్ సమయంలోనే 96.35శాతం పన్నులు వసూలు చేసి ఆదర్శంగా నిలిచారు. ఈసారి ఆమార్కును అధిగమించాలనే లక్ష్యంతో వసూలు ప్రక్రియను వేగవంతం చేశారు. మున్సిపల్ పరిధిలోని జల్‌పల్లి, శ్రీరాంకాలనీ, పహాడీషరీఫ్, వాదే ముస్తఫా, వాదే సాల్హెహీన్, షాహిన్‌నగర్, ఎర్రకుంట, కొత్తపేట, బిస్మిల్లాకాలనీ, సలాల ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

మరో 45 రోజులు

జల్‌పల్లి మున్సిపాలిటీలో మొత్తం 37,226 నివాసాలు, 3,300 ట్రేడ్ లైసెన్స్‌లను కలుపుకొని ఈ ఏడాది ఆస్తి పన్ను లక్ష్యాన్ని రూ.9.26 కోట్లుగా నిర్దేశించుకున్నారు. పాత బకాయిలు రూ.8.33 కోట్లు, జరిమానాలతో కలిపి మొత్తం రూ.24.54 కోట్ల వసూలే లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి 31లోపు టార్గెట్ చేరుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు రూ.5.76 కోట్లు వసూలు చేశారు. మరో 45 రోజులు మిగిలి ఉన్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ ఎప్పటికప్పుడు బిల్ కలెక్టర్లను అప్రమత్తం చేస్తున్నారు. దీంతో పాటు ప్రజలకు కూడా అవగాహన కల్పించేలా ఆటోలకు మైక్‌లు ఏర్పాటుచేసి, బల్క్ ఎస్‌ఎంఎస్‌లు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. స్వచ్ఛందంగా వచ్చి చెల్లించే



ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వారి కోసం కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ఎప్పటికప్పుడు చెల్లింపులు

జల్‌పల్లి మున్సిపాలిటీలో చాలా వరకు ప్రభుత్వ స్థలాల్లోనే నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా బస్తీల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో ఎప్పటికప్పుడు ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. దీంతో గతంలో మాదిరిగానే చివరి రోజుల్లో పెద్ద మొత్తంలో పన్నులు వసూలయ్యే అవకాశం ఉంది. నోటరీ డాక్యుమెంట్ల సమస్య పరిష్కారమైతే మున్సిపాలిటీ ఆదాయం మరింత పెరగనుంది. రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు పరిగణనలోకి తీసుకోలేని ఆస్తులకు సంబంధించినవి (కూలిన ఇళ్లవి)గా అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా ఆస్తి పన్ను విధింపులో హెచ్చు తగ్గులు వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భువన్ యాప్ ఆధారంగానే..



మున్సిపల్ ప్రజలందరూ సకాలంలో ఆస్తి పన్ను చెల్లించి, అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. మార్చి 31 నాటికి వందశాతం లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ముఖ్యంగా ప్రతీ ఆదివారం పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. భువన్ యాప్ ఆధారంగానే పన్నులు విధిస్తున్నాం. ఇందులో ఎలాంటి అపోహలున్నా నేరుగా సంప్రదించవచ్చు.

– బి.వెంకట్రామ్, మున్సిపల్ కమిషనర్, జల్‌పల్లి



మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌ను ఆహ్వానిస్తున్న మహేశ్వరం గిరిజన కాంగ్రెస్ నాయకులు

గిరిజనుల సంక్షేమానికి కృషి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం మండలానికి చెందిన కాంగ్రెస్ గిరిజన నాయకులు కేఎల్లార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 15న నిర్వహించే సేవాలాల్ జయంతిలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సేవాలాల్ సిద్ధాంతాలను ఆచరించాలని సూచించారు. కార్యక్రమానికి తప్పకుండా వస్తానని హామీనిచ్చారు. అదే విధంగా గిరిజన కాంగ్రెస్ నాయకులు పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జయంతి కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు నేనావత్ ఈశ్వర్ నాయక్, బొక్క జంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేనావత్‌రాజు నాయక్, అంధ్యా నాయక్, పాండు నాయక్, కృష్ణా నాయక్, సేవ్యా నాయక్, కె.రాజు నాయక్, దస్రునాయక్, రవినాయక్, హేమ్లా నాయక్, గోపాల్ నాయక్, దేవేందర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, మున్యా నాయక్, రవి, భాస్కర్, శ్రీను, రామునాయక్, భరత్, రాజు తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ నిర్వాహకులు రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, నాయకులు ఎస్.కృష్ణనాయక్, రఘుపతి,



స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

బి.పాండురంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, నారాయణ, పి.యాదయ్య, ఎ.భిక్షపతి, డి.శ్రీధర్, జగదీశ్, ఎండీ అఫ్జల్‌బేగ్, ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి

కందుకూరు: దేశ భవిష్యత్ తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది అన్నది ముమ్మాటికి నిజమని తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రాచులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. ఈ దశలో ప్రతి విద్యార్థి చదువుపై ఏకాగ్రత నిలిపి ముందుకుసాగాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సక్రమంగా వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంతకు ముందు



విద్యార్థులతో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్స్‌లో జరుగుతున్న బోధన తరగతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెలరోజులు అత్యంత కీలకమైనటువంటి సమయమని గుర్తుచేశారు. మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు, మండల విద్యాధికారి నర్సింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానం

- నేర నియంత్రణకు దోహదం
- దాతలు ముందుకు రావడం అభినందనీయం
- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి అన్నారు. నేరాలను అరికట్టడానికి, కేసుల పరిష్కారం, బాధితులకు సత్వర న్యాయం జరిగేందుకు, శాంతి భద్రతలు కాపాడటాని ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. మండల పరిధి నాగారం, మన్సాన్‌పల్లి, మహేశ్వరం గ్రామాల్లో గురువారం ఏసీపీ, సీఐలతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధి గ్రామాల్లో కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. సీసీలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టపడుతుందని స్పష్టంచేశారు.



మన్సాన్‌పల్లి చౌరస్తాలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీసీపీ తదితరులు

12 ఏఎన్‌పీఆర్ సీసీలు

మహేశ్వరం ఠాణా పరిధిలో సుమారు 3 వేల కెమెరాలు ఉన్నాయని, జోన్ పరిధిలో తొలిసారిగా ఏఎన్‌పీఆర్(ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలను అత్యధికంగా ఏర్పాటు చేసిన ఘనత దక్కిందని డీసీపీ తెలిపారు. మహేశ్వరం గేటు, రాచులూర్ గేటు, మహేశ్వరం విప్రో సర్కిల్, కోళ్లపడకల్, నాగారం, మన్సాన్‌పల్లి కూడలి, మహేశ్వరం అశ్విని కంపెనీలలో 12 ఏఎన్‌పీఆర్ కెమెరాలు, 12 మోటరైజ్డ్ కెమెరాలను అమర్చినట్లు ఆమె వెల్లడించారు. గ్రామాల్లో కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని డీసీపీ కోరారు. యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని కోరారు. వాటి నివారణకు పోలీసులకు సహకరించాలన్నారు. అంతకు ముందు ఠాణాలో కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన సీఐ, కెమెరాల ఇన్‌చార్జిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మధుసూదన్, కెమెరాల ఇన్‌చార్జి ప్రవీణ్, పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, నాగారం మాజీ సర్పంచ్‌లు దశరథ, వెంకటేశ్, రాములు నాయక్, రాజేష్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందేలా కృషిచేస్తా

- ఎంపీ ఈటల రాజేందర్



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నవీన్‌చారిని పరామర్శిస్తున్న ఎంపీ ఈటల

హుడాకాంప్లెక్స్: కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చైతన్యపురి మారుతీనగర్‌కు చెందిన నవీన్‌చారిని గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కొత్తపేటలోని సాయి సంజీవిని ఆస్పత్రిలో పరామర్శించారు. తిరుగు ప్రయాణంలో నగరవాసులు మృతి చెందడం బాధాకరమని, ఎలాంటి తప్పిదం లేకున్నా ఎదురుగా వచ్చిన భారీ లోడ్ ఉన్న లారీ ఢీ కొట్టడంతో ప్రాణనష్టం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కేంద్ర మంత్రులతో మాట్లాడతానని ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన మధ్యప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వం కూడా ఆదుకోవాలని ఆయన కోరారు. ఈటల వెంట కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణి, పవన్‌కుమార్ ఉన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

లయన్ జిల్లా గవర్నర్ కోటేశ్వర్‌రావు

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్ జిల్లా గవర్నర్ డాక్టర్ కోటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని లయన్స్ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాభావం ఉన్న వారు క్లబ్ సభ్యులుగా ఉన్నారని తెలిపారు. స్వార్థం లేకుండా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ.. క్లబ్‌లు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రూరల్ క్లబ్‌లలో ఆమనగల్లు క్లబ్ అందించే సేవలు ప్రశంసనీయమని, క్లబ్ ఏర్పాటై.. నాలుగు దశాబ్దాలు గడుస్తున్నా ప్రజాసేవలో మరింత పట్టుదలతో ముందుకు సాగుతుందని వెల్లడించారు. అనంతరం కోటేశ్వర్‌రావును లయన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఘనంగా సన్మానించారు. క్లబ్ వైస్ గవర్నర్ సురేశ్ జాగ్నాని, క్యాబినెట్ కార్యదర్శి సత్యనారాయణ, కో ఆర్డినేటర్ యాదయ్య ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు



కొందుర్గులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు పల్లెల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండలంలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్, ఉత్తరాసిపల్లి, గంగన్నగూడ, కొందుర్గు, పులుసుమామిడి గ్రామాల్లో ఆయన పర్యటించి సీసీరోడ్లు, ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో నెరవేరుస్తామన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రామయ్యగౌడ్, సయ్యద్‌సాదిక్, మల్లేశ్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నరేందర్, కృష్ణ, నర్సింలు, అంజిరెడ్డి, శ్రీను అంజనేయులు, ద్విజేందర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

- పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: సమీపిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని మండల బీఆర్‌ఎస్ నూతన అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆయన స్వగ్రామమైన కేతిరెడ్డిపల్లి గ్రామంలో మొయినాబాద్ గ్రామ నాయకులు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాహూఫ్, మోత్కుపల్లి గ్రామ నాయకులు వెంకట్‌రెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును వ్యతిరేకిస్తున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని, బీఆర్‌ఎస్ గెలిపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిద్దయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శివయ్య, చిన్నయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

విద్యార్థుల ప్రతిభ అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానాన్ని ప్రదర్శించినప్పుడే ఉన్నత శిఖరానికి ఎదుగుతారని హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి అన్నారు. విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌లో నిర్వహించిన పోటీ పరీక్షలో మండల పరిధిలోని అజీజ్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొనగా.. ముగ్గురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వారిని గురువారం పాఠశాల ఆవరణలో సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొని గెలుపొందినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ముగ్గురు విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు వారికి సంవత్సరానికి 12వేల రూపాయలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

- అర్హులందరికీ ఆరు గ్యారంటీలు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజాపాలన కొనసాగిస్తున్న ప్రభుత్వంపై.. ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో గురువారం పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. కడ్తాల్ మండలం మక్తమాదారంలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీరోడ్లు, మురుగు కాలువలు, రావిచేడు గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనం, సలార్‌పూర్‌లో రూ.10 లక్షలతో నిర్మించే సీసీరోడ్ల నిర్మాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సలార్‌పూర్ 9 మంది చెంచులకు వ్యవసాయ బోరు మోటార్‌లను అందజేశారు. తలకొండపల్లి మండలం పాతకోటతండాలో రూ.30 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనం, ప్రహరి నిర్మాణం, సీసీరోడ్లు, పడకల్‌లో రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.



న్యామతాపూర్‌లో రైతులకు బోరుమోటార్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

బీఆర్‌ఎస్‌వి పగటి కలలు

ప్రజాపాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నప్పటికీ.. ఓర్వలేని విపక్షాలు ప్రజలను తప్పుదోవపట్టిస్తూ విషప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి ఆరోపించారు. బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తామంటూ పగటి కలలు కంటుందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమాలలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, పార్టీ కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, తలకొండపల్లి సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, నాయకులు హన్మానాయక్, బిక్యానాయక్, డాక్టర్ శ్రీనివాస్, డేవిడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.